అంతా బహిరంగమే..

- రోడ్లపై యథేచ్ఛగా తాగుతున్న మందుబాబులు
- వైన్స్‌ల్లోనూ అడ్డగోలుగా పర్మిట్ రూమ్‌లు
- అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు చేస్తున్న బార్లు
- రోడ్డుపై తిరగాలంటే భయపడుతున్న మహిళలు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ వైన్స్ వద్ద రోడ్డుపైనే మద్యం తాగుతున్న మందు బాబులు

పట్నంబజారు: బహిరంగ మద్యంపానం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం... కఠిన చర్యలు తీసుకుంటాం.. మహిళలను ఇబ్బందులుకు గురి చేస్తే కేసులు తప్పవు నిత్యం మన పోలీసులు చెప్పే ఊక దంపుడు ఉపన్యాసాలు ఇవీ. అయితే వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వ వచ్చి వైన్స్‌లు ప్రైవేట్ పరం చేసిన పరిస్థితుల్లో మందుబాబులు మరింత పేట్రేగిపోతున్నారు. గుడి.. బడి అనే తేడా లేకుండా యథేచ్ఛగా మహిళలు రోడ్డుపై నడిచి వెళ్తున్నా.. మద్యం తాగుతున్న... పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చూడలేని పరిస్థితుల్లో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నగరంలో పరిస్థితి ఇలా..

గుంటూరు నగరంలో మొత్తం 33 వైన్స్‌లు, 64 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. వైన్స్‌లు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వమే నిర్వహించిన క్రమంలో ఎక్కడ పర్మిట్ రూమ్‌లు లేకపోవటం, బహిరంగ మద్యంపానంపై ఉక్కుపాదం మోపటంతో మందు బాబులు నేరుగా ఇళ్లకు వెళ్లి మద్యం తాగే పరిస్థితికి తీసుకుకొచ్చారు. ప్రైవేట్ వ్యక్తులు వేలం పాట ద్వారా వైన్స్‌లు కేటాయించిన నేపథ్యంలో.. కేవలం ఆదాయం ప్రధానంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఏమి జరిగినా.. తమకేమి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

మామూళ్లతో..

పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు ప్రతి నెల మామూళ్లు(యారక్)లు అందుతున్న క్రమంలో వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే వాదనలు లేకపోలేదు. వెస్ట్ పరిధిలోని వైన్స్‌ల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఏకంగా రోడ్డుపైన, నేరుగా వైన్స్‌ల కౌంటర్‌లపైన మద్యం పెట్టుకుని సేవిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం అరండల్‌పేట 3వలైనులో ఇద్దరూ మహిళలు నడుచుకుంటూ.. వెళ్తున్న క్రమంలో అటు.. ఇటు మందు బాబు మద్యం తాగుతున్న వారి మధ్య నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ వైన్స్ వద్ద పక్కనే ఉన్న బడ్డీకోట్లు బయటే బహిరంగ మద్యంపానం చేస్తున్నారు. అక్కడే ఆర్టీసీ బస్సులు నిలిపి.. ప్రయాణికులు దించుతారు.. అందులో మహిళలు కూడా ఉంటారన్న కనీస విషయాన్ని అధికారులు మర్చిపోయినట్టున్నారు. దీనికి తగ్గట్లు 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఆయా ప్రాంతాల్లోని ఎగ్జామ్ సెంటర్‌లకు వెళ్లి తిరిగి బస్సులు దిగుతున్న క్రమంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అరండల్‌పే 1వలైను మొదట్లో ఒక వైన్స్ వద్ద సీతారామస్వామి ఆలయం వద్ద, అదే లైనులో సాయిబాబు ఆలయం వద్ద మద్యం ఆలయ గోడలపై పెట్టుకుని మద్యం తాగుతున్నారు. పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాల వద్ద ఇదే పరిస్థితి ఏర్పడింది. అక్కడే ఉన్న వైన్స్‌లో కొనుగోలు చేసి చక్కగా రోడ్లుపై చెట్ల కింద నిలబడి మద్యం తాగేస్తున్నారు.



అరండల్‌పేటలో మద్యంప్రియుల నడుమ భయపడుతూ వెళ్తున్న మహిళలు

అర్ధరాత్రి 'బార్ల' తెరుస్తున్నారు....

రాత్రి 10 గంటల వరకే వైన్స్‌ల్లో మద్యం అమ్మకాలు జరపాలన స్పష్టమైన ఆదేశాలు ఉన్నా ఏ ఒక్క దుకాణదారుడు పట్టించుకోవడం లేదు. అందుకు నిలువెత్తు నిర్లక్ష్యాలు వారికి అందుతున్న మామూళ్లేననే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైన్స్‌ల సంగతి అటు పెడితే.. బార్ అండ్ రెస్టారెంట్‌ల పరిస్థితి దారుణంగా మారింది. బార్‌లలో అందించిన సౌకర్యాలకు తగ్గట్లుగా రేట్లు, ప్రభుత్వం కేటాయించిన ధరలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఏ ఒక్క బార్ అండ్ రెస్టారెంట్‌లోనూ అటువంటి నిబంధనలు పాటించటంలేదని తెలుస్తోంది. దీనికి తగ్గట్లు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌లు తెల్లవార్లు తెరిచి ఉంటున్నాయనే చెబుతున్నారు. 24/7 మద్యం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అందుబాటులో ఉంటోంది. ఓల్డ్‌క్లబ్ రోడ్డులో సమీపంలో ఉన్న ఒక బార్‌లో 'కాలచక్రం'తో పాటు బార్ కూడా పనిచేస్తూనే ఉంటుందని మందుబాబులు చెప్పుకుంటున్నారు. మరో బార్ 'స్వాతి' ముత్యంలా వెనుక నుంచి దారి పెట్టి తమకేమీ తెలియని విధంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. అరవై అడుగుల రోడ్డు మూలన ఉన్న ఒక బార్ సైతం షెట్టర్లు ఎత్తి మరీ అమ్మకాలు చేస్తున్నారు.

అధికారుల తనిఖీలు ఉన్న రోజు....

అధికారుల తనిఖీలు ఉన్న రోజు మాత్రం వైన్స్, బార్‌ల యాజమానులకు ముందుగానే సమాచారం అందుతుంది. ఆయా స్టేషన్‌ల అధికారులు నైట్ రౌండ్స్‌కు బయలుదేరే ముందు బార్‌లు, వైన్స్‌లకు ఆయా అధికారుల డ్రైవర్‌లు, మఫ్టీ పార్టీల నుండి ముందస్తు సమాచారం అందుతోందనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటీకైనా పోలీసు, ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించి, బహిరంగ మద్యంపానం, అర్ధరాత్రుల అమ్మకాలు నిలువరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

బహిరంగ మద్యంపానంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే డ్రోన్‌లు, మఫ్టీ పార్టీల ద్వారా పరిశీలిస్తున్నాం. బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఇకపై మరింత దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా బహిరంగ మద్యపానాన్ని నిలువరిస్తాం.

– కె.అరవింద్, డీఎస్పీ వెస్ట్, ఈస్ట్ ఇన్‌చార్జి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

వైన్స్‌ల వద్ద బహిరంగ మద్యంపానం, ఎమ్మార్పీల కంటే అధిక ధరలపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. తనిఖీలు నిర్వహిస్తాం.

– మారయ్యబాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



పట్నంబజారు: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ షేక్ నూరిఫాతిమా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కాలంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి మృతి చెందడంతో ఒంగోలులోని ఆయన స్వగృహంలో ఆయన్ని పరామర్శించారు. ఆమె వెంట పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

ఆస్తి పన్ను చెల్లించడానికి నేడు తుది గడువు

నెహ్రూ నగర్: ఆస్తి పన్ను చెల్లించటానికి సోమవారం ఒక్కరోజే గడువు ఉన్నందున ఈ నెల 31వ తేదీ రంజాన్ పండుగ సెలవు రోజైనప్పటికీ పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యంగా నగరపాలక సంస్థ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం రాయితీని వినియోగించుకొని పన్ను చెల్లించాలని కోరారు. కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటించిన నాటి నుంచి ఆదివారం వరకు సుమారు 17,850 మంది రూ.19.90 కోట్లు పన్ను చెల్లించారని చెప్పారు.

కళాకారులకు సత్కారం



నగరంపాలెం: అనేక నాటకాల్లో పలు పాత్రలను పోషించి, ప్రేక్షకుల మన్ననలు పొందారని సినీ దర్శకుడు శివ నాగేశ్వరరావు అన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు వీరెళ్ళ సుబ్బారావు వర్ధంతి సభ ఆదివారం గుజ్జనగుండ్ల శ్రీవిఘ్నేశ్వర డ్రామా డ్రెస్ కంపెనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరుడు, బ్రహ్మం, అర్జునుడు, నక్షత్రేశ్వరుడు, కర్ణుడుతోపాటు ఇరవై పాత్రల్లో నటించారని అన్నారు. అనంతరం కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో అంగలకుటి ప్రసాద్, షేక్ లాల్‌అహ్మద్, జీవీ శివశంకర్, గుర్రాల వెంకటేశ్వరరావు, ఎల్.గురవయ్య పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో ఆదివారం ఈశ్వర వర ప్రసాద పరిషత్ ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు జరిగాయి. మల్లాది శివానంద ఎస్ఎస్‌వీ తన గాత్రంతో విరిబోణి ఆరుతాళ వర్ణం, వాతాపి గణపతిం భజే, ఎవరిని నిర్ణయించదరో, మాతంగి శ్రీరాజరాజేశ్వరి రామ ప్రియ వంటి త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు, పరిషత్ ట్రస్టీ నిర్వాహకులు మోదుగుల రవికృష్ణ ప్రసంగించగా, రాష్ట్ర ప్రభుత్వ కళా రంగ పురస్కారాలు అందుకున్న మల్లాది రవికుమార్, లంక అన్నపూర్ణదేవిలను సత్కరించారు.

పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

పొన్నూరు: పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ యువ నాయకులు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా పేద ముస్లిం మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొని మహిళలకు దుప్పట్లు చీరలు అందజేశారు.

బైక్ చోరీ

చేబ్రోలు: చేబ్రోలులోని ఇంజినీరింగ్ కళాశాల ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు వ్యక్తులు దొంగలించిన ఘటనపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు ఐడీపీ కాలనీకి చెందిన కొత్త వెంకట సాయి కృష్ణ, చేబ్రోలులోని ఆర్‌వీఐటీ కళాశాలలో జరుగుతున్న ఫెస్ట్‌కు హాజరయ్యాడు. కళాశాల ప్రాంగణం ముందు షైన్ బైక్‌ను నిలిపి కళాశాలకు వెళ్లిన ఇంజినీరింగ్ విద్యార్థి రెండు గంటల తరువాత బయటకు వచ్చి చూసేసరికి ద్విచక్ర వాహనం మాయమైంది. ఆదివారం చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫెస్ట్‌లో జేబుదొంగల చేతివాటం

చేబ్రోలులోని ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన ఫెస్ట్‌లో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. బైక్ చోరీ ఘటనతో పాటు విద్యార్థులకు చెందిన సెల్ ఫోన్‌లు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులు అందాయి.

ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ రామకృష్ణ



గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గొల్ల రామకృష్ణ ఆదివారం అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు పురస్కారం అందజేశారు. న్యూరోసర్జన్‌గా 15 ఏళ్లుగా వైద్యసేవలందిస్తూ 20 వేలకు పైగా బ్రెయిన్, స్పైన్ సర్జరీలు చేసి ఎంతో మంది పేద రోగులకు నూతన జీవితాన్ని డాక్టర్ రామకృష్ణ ప్రసాదించారు. ఆయన చేసిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందజేసింది. సీఎం చేతుల మీదుగా పురస్కారం అందుకున్న డాక్టర్ రామకృష్ణకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, న్యూరోసర్జరీ వైద్యులు, జీజీహెచ్ వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నెహ్రూ నగర్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రతి సోమవారం గుంటూరు నగరపాలక సంస్థలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు స్థానిక సమస్యలపై నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

వైభవంగా విశ్వావసు నామ సంవత్సర వేడుకలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేషార్చనలు, ప్రత్యేకాలంకరణలను ఆలయ అర్చకుల బృందం చేశారు. భాష్యం విద్యా సంస్థల నుంచి భక్తులకు ఉగాది పచ్చడి, ప్రత్యేక ప్రసాద వితరణ చేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు స్వామి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం అన్నమయ్య కళావేదికపై జరిగిన కవి సమ్మేళనంలో కేంద్ర సహాయ మంత్రి ప్రసంగిస్తూ కవులకు, కళాకారులకు, సమాజహితం కోరి పని చేసే వార్ని ప్రభుత్వం ప్రత్యేకంగా గౌరవిస్తుందని అన్నారు.



కవుల సమ్మేళనంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ధార్మిక ప్రాంగణంలో..

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని ధార్మిక ప్రాంగణంలో సుదరసత్సాంగ్ నిర్వహణలో శ్రీసుందర చైతన్యానందస్వామి శిష్యులు, ఆధ్యాత్మిక ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..

స్థానిక అరండల్‌పేటలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. లోక కల్యాణం, ప్రజలు ధన, ధాన్యాలు, ఐశ్వర్యంతో ఉండాలని శ్రీఆదిలక్ష్మీ అమ్మవారికి వేద పారాయణం, నవ ధాన్యాలతో విశేష అభిషేకార్చన చేశారు. అనంతరం ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను భక్తులకు నిర్వాహకులు మర్రిపాటి ప్రసాద్ అందించారు.



కేంద్ర మంత్రి పెమ్మసాని దంపతులకు ఆశీస్సులు అందిస్తున్న అర్చకుడు

బృందావన్‌గార్డెన్స్‌లో..

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున కల్చర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి పంచాగ శ్రావణం చేశారు. అనంతరం డాక్టర్ మన్నవ సత్యనారాయణ పర్యవేక్షణలో కవి సమ్మేళనం జరిగింది. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి హాజరై, కవులను సత్కరించారు. నాగార్జున కల్చర్ సెంటర్ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, నాగార్జున కల్చర్ సెంటర్ మ్యూజిక్ కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ పర్యవేక్షించారు. సాయంత్రం ప్రముఖ గాయకుడు చంద్రతేజ, రమణి, రమాప్రభ ఘంటసాల పాటలు ఆలపించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, డీఆర్ఎం రామకృష్ణ, జనచైతన్య డైరెక్టర్ మాదల రత్నగిరి బాబు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తి పంచాంగ శ్రవణం గావించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవా తత్పరుడు నందనంపాటి రామాంజనేయులును ఉగాది పురస్కారంతో సత్కరించడంతో పాటు సీనియర్ వైద్యుడు డాక్టర్ జీవీ కృష్ణారావుకు వైద్యరంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీతో పాటు ప్రతి నెలా పేద వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు అందజేయడం ద్వారా అవోపా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అవోపా రాష్ట్ర కార్యదర్శి రాచపూడి సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది విద్యార్థులకు రూ.50 లక్షలు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు ఆరవేటి నిర్మల, కార్యదర్శి రాధాకష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మద్ది సాయి రమేష్ పాల్గొన్నారు.



జీవీ కృష్ణారావు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న అవోపా ప్రతినిధులు



అరండల్‌పేటలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు



కేవీ కోటేశ్వరరావు పంచాంగ శ్రవణం

నేటి నుంచి మహా కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో సోమవారం నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు మహా కుంభాభిషేకం మహోత్సవం, సీతారాముల కళ్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 31న సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి విశేష పూజలు, హోమాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. 5వ తేదీన ఉదయం 8 గంటలకు స్వామివారి పెండ్లి కుమారుని ఉత్సవం, 6న శ్రీరామనవమి పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 8న ఉదయం 8 గంటలకు విశేష పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం జరుగుతుందని వివరించారు. పదో తేదీన సాయంత్రం 6 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవంగా బాజీబాబా ఉరుసు మహోత్సవం



ఉరుసు సందర్భంగా గ్రామోత్సవం ముగించుకుని దర్గాకు చేరుకున్న బాబావారి గుర్రం, వక్ఫ్‌బోర్డు అధికారులు

పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పెదకాకాని సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 537వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలతో మహోత్సవం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు అధికారులు ఇబ్రహీంబేగ్, మహ్మద్ హుస్సేన్, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్గా ఉరుసు మహోత్సవం సంప్రదాయ పద్ధతిలో భాగంగా పెదకాకాని పొలిమేర సెంటర్ నుంచి ప్రత్యేక చాందినీ అలంకరణలో గంధం బిందెలతో శనివారం రాత్రి ప్రారంభమైంది. బాజీబాబా వారి గుర్రం ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు వెనిగండ్ల, పెదకాకాని గ్రామ పురవీధులలో గ్రామోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు బాజీబాబా వారి గుర్రానికి మిఠాయిలు, పండ్లు తినిపించారు. కొబ్బరికాయలు, పూలు, గంధం సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. బాబావారి గుర్రం దర్గాలోకి చేరుకోగాలనే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు గంధం పంపిణీ చేశారు. పకీర్ల సన్నాయి వాయిద్యాలు, బ్యాండ్‌మేళాలు, కనకతప్పెట్లు, బాణసంచా వెలుగుల్లో ఉరుసు అత్యంత వైభవంగా జరిగింది. వీధులలో బాబా వారి ఉరుసు మహోత్సవాన్ని భక్తులు స్వాగతించి పూజలు చేశారు.

ప్రధాన రహదారులపై చిన్న చూపు..

- ఏటుకూర్ మెయిన్‌రోడ్ తవ్వేశారు..
- రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు
- శివారు కాలనీల్లో అధ్వానం



శ్రీనివాసరావుపేట నుంచి రామనామక్షేత్రం వరకు వెళ్లే రోడ్డుపై లేచిన కంకర రాళ్లు

నగరంపాలెం: నగరంలో ప్రధాన రహదారులను జీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. పలు ప్రాంతాలకు అనుసంధాన మైన వాటిని అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో రాకపోకలకు స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ రహదారికి పీకలవాగు పక్కనే ఉన్నా రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు కష్టం..

ఏటుకూర్ మెయిన్‌రోడ్ నుంచి కొబ్బరితోట వైపుగా వెళ్లేందుకు కొన్నేళ్ల క్రితమే ప్రధాన రహదారి నిర్మించారు. కొబ్బరితోట, సంపత్ నగర్, శ్రీనివాసరావుపేట అరవై అడుగుల రోడ్డు, ఏటుకూర్ మెయిన్ రోడ్డు వెళ్లేందుకు ఈ రహదారి ఉపయోగపడుతోంది. పాదచారుల రాకపోకలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ ప్రధాన రహదారిని ఆధునీకీకరించాలనే ఉద్దేశంతో కొద్ది నెలలు క్రితం ప్రణాళికలు రూపొందించారు. ఈ క్రమంలో తారు రోడ్డు నిర్మించేందుకు గ్రావెల్‌తో చదును చేయించారు. దీంతో తారురోడ్డుపై రాకపోకలు చేసేందుకు అనువుగా ఉంటుందని అందరూ భావించారు. అయితే గ్రావెల్‌తో రహదారిని చదును చేయించి మూడు నెలలు గడిచాయి. నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదని స్థానికులు, చోదకులు వాపోతున్నారు. దీంతో రాకపోకలకు కష్టాలు మొదలయ్యాయి. కంకరరాళ్లు పైకిలేవడంతో అటుగా వెళ్లే సమయంలో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నా రు. దుమ్ము, ధూళి పైకి లేవడంతో ముందు వెళ్లే వాహనాలు కనిపించడంలేదని చోదకులు వాపోతున్నారు.

వాగుతోనూ భయాందోళన..

ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు రోజు ఒకరిద్దరైనా ప్రమాదవశాత్తు కిందపడిన ఘటనలు లేకపోలేదు. దీనికితోడు ఈ రహదారికి పక్కనే పీకలవాగు ప్రవహిస్తోంది. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఏమాత్రం వాహనాలు అదుపు తప్పిన పీకలవాగులోకి చేరాల్సిందేనని స్థానికులు చెబుతున్నారు.



పీకలవాగు అనుకుని ఏటుకూరు మెయిన్ రోడ్డు నుంచి కొబ్బరితోట వైపు వెళ్లే రోడ్డు దుస్థితి

ప్రారంభంకాని పనులు..

శ్రీనివాసరావుపేట నుంచి రామనామా క్షేత్రం వైపు వెళ్లే ప్రధాన రహదారి కూడా కీలకమైనది. ఈ రహ దారి మీదగా నల్లచెరువు, సంపత్‌నగర్, కేవీపీ కాలనీ, లాలుపురం రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇటుగా వెళ్తే ఆయా ఏరియాలకు తక్కువ సమయంలో త్వరగా చేరుకునేందుకు అవకాశాలు ఎక్కువ. నాలుగు నెలలు క్రితం తారురోడ్డు నిర్మాణం చేపట్టేందుకు గ్రావెల్, కంకర రాళ్లతో చదును చేయించారు. తర్వాత దారి మధ్యలో మళ్లీ గ్రావెల్ కుప్పలు పోశారు. ఇటీవల గ్రావెల్ కుప్పలను మళ్లీ చదును చేశారు. అయితే తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభంకాలేదు.

దుమ్మురేగుతోంది..

ఏదైనా చిన్న వాహనం వెళ్లిన తెల్లని దుమ్ము ధూళి పైకి వస్తోంది. దుమ్ము కళ్లల్లోకి చేరుతుందని స్థానిక దుకాణదారులు, వాహనదారులు వాపోతున్నారు. తద్వారా ఊపిరి తిత్తుల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చిల్లర దుకా ణం నిర్వర్తించే ఓ మహిళ వాపోయింది. ఏవై నా భారీ వాహనాలు వెళ్తే జీఎంసీ పొగ లారీ వెళ్లినట్టే ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. వయా శ్రీనివాసరావుతోట మీదగా కై లాస్‌భూమి సమీపంలోని వంతెన వద్ద నుంచి శ్రీరామా నామక్షేత్రం వరకు రహదారి అధ్వా న్నంగా మారింది. ఈ రహదారి అధ్వానంగా ఉండటంతో చాలా మంది కొబ్బరితోట మీద నుంచి కేవీపీ కాలనీకి వెళ్లే రోడ్డుపై రాకపోకలు చేస్తున్నారు. ఈ రహదారి అధ్వానంగా ఉన్న రాకపోకలకు తప్పడంలేదని పలువురు వాపోతున్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com